సాక్షి చిత్తూరు

బుధవారం । 23 । జులై । 2025



జ్వరోత్పాతం
సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు సరైన చికిత్స అందక ప్రైవేటుకు వెళ్తున్నారు. - 8లో



వదలబొమ్మాళీ.. వదలా!
జిల్లా ఇన్‌చార్జి పీడీ సస్పెండ్ అయినా కార్యాలయానికి వస్తూ .. విధులు నిర్వహిస్తుండడం గమనార్హం. - 8లో



ఇంటి దొంగల గుట్టురట్టు
బోయకొండ గంగమ్మ ఆలయంలో టికెట్ల విక్రయాల చేతివాటంపై ఆరుగురు సిబ్బందిపై అధికారులు వేటు వేశారు. - 8లో

న్యూస్‌రీల్

29న హుండీ లెక్కింపు

కాణిపాకం : ఈనెల 29వ తేదీన కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన హుండీ లెక్కిస్తున్నట్లు ఈఓ పెంచల కిషోర్ తెలిపారు. ఆలయ ఆస్థాన మండపంలో ఉదయం 7 గంటలకు హుండీ లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. ఆలయ అధికారులు, సిబ్బంది విధిగా పాల్గొనాలని ఆయన కోరారు.

డైట్ కౌన్సెలింగ్ పొడిగింపు



డైట్ కళాశాల ప్రిన్సిపల్ వరలక్ష్మి

కార్వేటినగరం : జిల్లా విద్యాశిక్షణా సంస్థ (డైట్) కౌన్సెలింగ్ 24వ తేదీ వరకు పొడిగించినట్లు డైట్ ప్రిన్సిపల్ వరలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. ఈనెల 17 నుంచి డైట్ కళాశాలలో నిర్వహించిన డీసెట్ కౌన్సెలింగ్‌ను అభ్యర్థుల సౌకర్యార్థం 24వ తేదీ వరకు గడువు పెంచడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం కార్వేటినగరంతో పాటు ప్రైవేటు డైట్ కళాశాలల కోసం 194 సీట్లకు గాను 98 మంది అభ్యర్థులకు మాత్రమే సర్టిఫికెట్ల పరిశీలన జరిగిందని పేర్కొన్నారు. మిగిలిన సీట్ల కోసం అర్హత కలిగిన అభ్యర్థులు వెంటనే తమ సర్టిఫికెట్లతో జిల్లా విద్యాశిక్షణా సంస్థ (డైట్)లో నిర్వహిస్తున్న సర్టిఫికెట్ల పరిశీలనలో పాల్గొని తమకు కేటాయించిన కళాశాలలో చేరాలని సూచించారు. అలాగే మంగళవారం నిర్వహించిన ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలనకు తెలుగు మీడియానికి 10 మంది, ఇంగ్లీష్ మీడియానికి 9 మంది అభ్యర్థులు హాజరైనట్లు ప్రిన్సిపల్ పేర్కొన్నారు.

ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని నిరుద్యోగ అభ్యర్థులు ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి దొణప్ప తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించే బ్యూటిఫికేషన్, రిటైల్ కోర్సులకు ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు ఆసక్తి ఉన్న నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు బయోడేటాతో ఈనెల 23వ తేదీన జిల్లా ఉపాధి కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఇతర వివరాలకు 83286 77983, 76710 66532 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

శాస్త్రోక్తంగా ప్రదోషకాల పూజలు



నందీశ్వరుడికి పూజలు చేస్తున్న అర్చకులు

కాణిపాకం : కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన అనుబంధ ఆలయమైన మణికంఠేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ప్రదోషకాల పూజలను శాస్త్రోక్తంగా జరిపించారు. ఈసందర్భంగా మూలవిరాట్, నందీశ్వరుడికి ఏక కాలంలో ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. అనంతరం అలంకరణ చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కార్యక్రమంలో దేవస్థాన ఈఓ పెంచల కిషోర్, ఏఈఓ రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ కేంద్రాల పరిశీలన



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

శాంతిపురం : కలెక్టర్ సుమిత్ కుమార్ మంగళవారం మండలంలో ఆకస్మిక పర్యటన నిర్వహించారు. మండల సచివాలయంలోని తహసీల్దారు కార్యాలయంలో ఎంపీడీవో కుమార్, తహసీల్దార్ శివయ్య, ఇతర అధికారులతో సమావేశమయ్యారు. మండల కేంద్రం, రాళ్లబూదుగూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డిజిటల్ సెంటర్ల పనితీరును పరిశీలించారు. ఆస్పత్రికి వైద్యం కోసం వచ్చే వారి ఆరోగ్య వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయడం ద్వారా సత్వరం మెరుగైన వైద్యం అందించే వీలు కలుగుతుందని చెప్పారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో క్యూ కాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లన్నీ నిండిపోయాయి. క్యూ ఏటీజీహెచ్ వద్దకు చేరుకుంది. సోమవారం అర్ధరాత్రి వరకు 77,481 మంది స్వామివారిని దర్శించుకోగా 30,612 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.96 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

అయ్యోర్లకు.. బియ్యం మోత



- పుంగనూరు మండలంలో జెడ్పీహెచ్ఎస్ వనమలదిన్నె పాఠశాల సీఆర్‌సీగా ఉంది. ఆ పాఠశాల పరిధిలో 23 ప్రాథమిక, ఉన్నత పాఠశాలలున్నాయి. వనమలదిన్నె పాఠశాల సీఆర్‌సీ నుంచి మంగళం ప్రాథమిక పాఠశాలకు 15 కి.మీ దూరం ఉంది. ప్రతి నెలా మంగళం ప్రాథమిక పాఠశాలకు 15 కి.మీ దూరంలో ఉన్న వనమలదిన్నె నుంచి బియ్యం, ఇతర నిత్యావసర వస్తువులను మంగళం పాఠశాల టీచర్లే మోసుకెళ్తున్నారు. ప్రతి నెలా మంగళం పాఠశాలకు నాలుగు 25 కేజీల బియ్యం మూటలను మోసుకెళ్లాల్సిన దుస్థితి.

- పలమనేరు మండలం కొలమాసనపల్లి జెడ్పీ హైస్కూల్ సీఆర్‌సీగా ఉంది. దీని పరిధిలో 18 ప్రాథమిక, ఉన్నత పాఠశాలలున్నాయి. సీఆర్‌సీ నుంచి దొడ్డిపల్లి ఎస్టీ ప్రాథమిక పాఠశాలకు ప్రతి నెలా 25 కేజీల బియ్యం మూటలు రెండు మోసుకెళ్తున్నారు. అసలే దొడ్డిపల్లి ఎస్టీ ప్రాథమిక పాఠశాల అటవీ ప్రాంతంలో ఉండటంతో రవాణా సౌకర్యం లేదు. దీంతో ప్రతి నెలా ఆ పాఠశాల హెచ్ఎం బియ్యం మూటలను తీసుకెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రెండుచోట్లే కాదు జిల్లాలో సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పంలో సైతం ఇదే పరిస్థితి. సీఆర్‌సీ కేంద్రాల నుంచి టీచర్లు బియ్యం మూటలు మోసుకెళ్లాల్సిన అగత్యం ఏర్పడింది.

విద్యార్థులకు పాఠాలు బోధించాల్సిన టీచర్లు.. బడి బియ్యం మూటలు మోయలేక అవస్థలు పడుతున్నారు. మధ్యాహ్న భోజన పథకానికి అందించే బియ్యం బస్తాలు క్లస్టర్ పాఠశాలల వద్ద అధికారులు దించేస్తున్నారు. అక్కడి నుంచి ఆయా పరిధిలోని పాఠశాలలకు టీచర్లు ప్రతి నెలా బియ్యం మూటలను మోసుకెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. నిబంధనల మేరకు ప్రతి నెలా ఆయా పాఠశాలల వద్దకే మధ్యాహ్న భోజన బియ్యం తీసుకురావాల్సి ఉండగా కేవలం క్లస్టర్ కేంద్రాల వద్దే దింపేస్తుండడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. దీనిపై ఉపాధ్యాయ సంఘాలు మండి పడుతున్నాయి.

- ప్రతి నెలా బడి బియ్యంను కి.మీ. దూరం మోసుకెళ్తున్న టీచర్లు
- క్లస్టర్ పాఠశాలల వద్ద మధ్యాహ్న భోజన బియ్యం అన్‌లోడింగ్
- గోడౌన్ డీటీ, ఎంఈవో-2 లపై ఆరోపణలు
- పాఠశాల వద్దకే బియ్యం చేర్చాలన్న నిబంధన అమలు కాని వైనం
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు



సీఆర్‌సీ పాఠశాలల్లో దించిన బియ్యం మూటలు తీసుకెళ్లేందుకు వచ్చిన టీచర్లు

చిత్తూరు కలెక్టరేట్ : టీచర్లతో కూటమి ప్రభుత్వం బియ్యం మూటలు మోపిస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ వింత ధోరణి కూటమి పాలనలో అమలవుతోంది. గత ఏడాదిగా జిల్లాలోని సీఆర్‌సీ (క్లస్టర్ రీసోర్స్ సెంటర్) నుంచి ఆ పరిధిలోని ఇతర పాఠశాలలకు బియ్యం మోసుకెళ్లాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. ఈ సమస్యను క్షేత్ర స్థాయిలోని హెచ్ఎంలు, టీచర్లు ఉన్నతాధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేని పరిస్థితి. దీంతో ప్రతి నెలా హెచ్ఎంలు, టీచర్లు ఇబ్బందులు పడుతున్నారు. టీచర్ల చేత కూటమి ప్రభుత్వం బియ్యం మూటలు మోయించడంపై క్షేత్రస్థాయిలో తీవ్ర విమర్శలు వెలువెత్తుతున్నాయి.

148 సీఆర్‌సీల పరిధిలో సమస్యలు

జిల్లా వ్యాప్తంగా ఉన్న 2,460 పాఠశాలల్లో 148 ఉన్నత పాఠశాలలను సీఆర్‌సీ (క్లస్టర్ రీసోర్స్ సెంటర్) గా ఎంపిక చేశారు. ఇలా ఎంపిక చేసిన 148 సీఆర్‌సీ కేంద్రాల్లో ఒక్కో సీఆర్‌సీ పరిధిలో దాదాపు 17 నుంచి 25 పాఠశాలల వరకు వస్తాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న 148 సీఆర్‌సీల నుంచి ప్రతి నెలా టీచర్లు బియ్యం మూటలు మోసుకెళ్తున్నారు. ఈ సమస్యపై క్షేత్రస్థాయిలో టీచర్లు విమర్శలు గుప్పిస్తున్నారు.

పనిభారం

ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న టీచర్లను సమగ్రశిక్ష శాఖ పరిధిలో చిరు జీతాలకు పనిచేస్తున్న సీఆర్‌పీలను కూటమి ప్రభుత్వం గ్రామి కులుగా మార్చేసింది. వింత నిర్ణయాలను అమలు చేస్తూ విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తోంది. గత ఐదేళ్ల పాటు అభివృద్ధి బాటలో ముందుకెళ్లిన విద్యావ్యవస్థను కూటమి ప్రభుత్వంలో వెనుకబడుతోంది. అసలే పాఠశాలల్లో యాప్‌లు, వివిధ కార్యక్రమాల పేరుతో టీచర్లను ఇబ్బందులు పెడుతున్న విషయం విదితమే. దీంతో పాటు ప్రతి నెలా టీచర్లను బియ్యం మూటలను మోసుకెళ్లే దుస్థితికి కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిందని టీచర్లు భగ్గుమంటున్నారు.



సీఆర్‌సీ కేంద్రం కాకుండా పాఠశాలల వద్దకే బియ్యం సరఫరా చేయాలంటూ నిరసన తెలిపి ఎంఈవోకు వినతిపత్రం ఇస్తున్న ఎస్టీయూ నేతలు (ఫైల్)



జిల్లాలోని పుంగనూరు నియోజకవర్గంలోని వనమలదిన్నె సీఆర్‌సీ పాఠశాల



పలమనేరు మండలం కొలమాసనపల్లి సీఆర్‌సీ పాఠశాల

జిల్లా సమాచారం

పాఠశాల కేటగిరీ	పాఠశాలల సంఖ్య	విద్యార్థుల సంఖ్య
ప్రాథమిక	2,113	83,874
ప్రాథమికోన్నత	237	21,950
ఉన్నత	312	62,231
హైస్కూల్ ప్లస్	25	10,155
ప్రాథమిక, ఉన్నత	174	40,288
ప్రాథమిక, హైస్కూల్ ప్లస్	27	14,815

సివిల్ సప్లై డీటీ, ఎంఈవో-2లపై ఆరోపణలు

జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల వద్దకు మధ్యాహ్న భోజనం బియ్యం మూటలను దించాల్సిన బాధ్యత సివిల్ సప్లై డీటీలపై ఉంటుంది. ప్రతి మండలంలో బియ్యం గోడౌన్ ఇంచార్జీలుగా ఉండే సీఎస్‌డీటీలకు పాఠశాలల వద్దకు బియ్యం దింపేందుకు గాను ప్రభుత్వం కి.మీ చొప్పున ప్రత్యేక రవాణా చార్జీలను ఇస్తోంది. అదే విధంగా ప్రతి పాఠశాల వద్దకే బియ్యం సరఫరా చేయాలనే నిబంధన ఉంది. కాగా జిల్లాలో ఈ నిబంధన ఏ మండలంలోనూ అమలు కావడం లేదు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే ఎంఈవో-2, గోడౌన్ ఇంచార్జిలుగా ఉండే సివిల్ సప్‌లైస్ డీటీలు కుమ్మక్కై రవాణా చార్జీలను నొక్కేసేందుకు సీఆర్‌సీ కేంద్రాలను బియ్యం సరఫరా చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

విద్యావ్యవస్థ విచ్ఛిన్నం



కూటమి ప్రభుత్వ పాలనలో విద్యావ్యవస్థ విచ్ఛిన్నం అయ్యింది. రాష్ట్ర స్థాయిలో అధికారులు చేపడుతున్న ప్రణాళికలు, విద్యాసంబంధ చర్యలు ప్రాథమిక విద్యను బలహీనపరుస్తున్నాయి. క్షేత్ర స్థాయిలో ఉండే టీచర్ల సమస్యలు ఏ మాత్రం పరిష్కారం కావడం లేదు. ప్రతి నెలా టీచర్లు కి.మీ దూరంలో ఉండే పాఠశాలలకు సీఆర్‌సీ కేంద్రం నుంచి బియ్యం మూటలు ఎలా తీసుకెళ్తారు. అటవీ ప్రాంతాల్లో ఉన్న పాఠశాలలకు బియ్యం మూటలు తీసుకెళ్లలేక టీచర్లు అవస్థలు పడుతున్నారు. అసలే కూటమి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న యాప్‌లు, ఆన్‌లైన్ పనులకు, జూమ్ మీటింగ్‌లకు వ్యతిరేకంగా త్వరలోనే టీచర్లు రోడ్డు ఎక్కే పరిస్థితి కనపడుతోంది. బియ్యం మోసుకెళ్లే సమస్యను ఉన్నతాధికారులు పరిష్కరించాలి.

– రెడ్డి శేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్

బెయిల్ రావాలంటూ పూజలు



పూజలు చేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, దామోదరరాజు



బైరెడ్డిపల్లె చెక్‌పోస్టు కూడలి వద్ద వైఎస్సార్‌సీపీ నేతల నిరసన


- అక్రమ కేసు పెట్టి అన్యాయంగా ఇరికించారు : జెడ్పీ చైర్మన్

చౌడేపల్లి : మద్యం అక్రమ కేసులో అరెస్ట్ అయిన రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డికి బెయిల్ రావాలంటూ జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దామోదరరాజు మంగళవారం బోయకొండలో గంగమ్మకు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయ ఎదుగుదలను ఓర్వలేక మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబంపై కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఏదో ఒక రకంగా ఎల్లో మీడియా ద్వారా దుష్ప్రచారం చేసున్న విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకపోగా ప్రజల పక్షాన పోరాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలపై కేసులు పెట్టి హింసించడం న్యాయమా అంటూ ప్రశ్నించారు. 2014–2019 దాకా ఊరూరా బెల్టుషాపులు తెచ్చి దోచుకున్నది చంద్రబాబే ననంటూ ఆరోపించారు. బోయకొండ గంగమ్మ ఆశీస్సులతో అక్రమంగా అరెస్ట్ అయిన మిథున్‌రెడ్డికు బెయిల్ రావాలని పూజలు చేసినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట నాయకులు రాజశేఖర్ రెడ్డి తదితరులున్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్ దుర్మార్గం

బైరెడ్డిపల్లె : వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డిని అక్రమ కేసులో కూటమి ప్రభుత్వం అరెస్ట్ చేయడం దుర్మార్గమని ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, జెడ్పీటీసీ ఆర్.కేశవులు, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ కార్యదర్శి బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తి మండిపడ్డారు. మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేయడంపై బైరెడ్డిపల్లెలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం భారీ ర్యాలీ చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వందల మందిపై అక్రమ కేసులు పెట్టి అరెస్టులు చేసినా వైఎస్సార్‌సీపీని అణచివేయలేరన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్, ఇతర కేసుల్లో చంద్రబాబు బెయిల్‌పై ఉన్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వైఎస్సార్‌సీపీ సంయుక్త కార్యదర్శి దయానందగౌడు, మండల యూత్ ప్రెసిడెంట్ మహేష్, మండల కన్వీనర్ కార్తిక్, వైస్ ఎంపీపీలు రూపజయకుమార్‌రెడ్డి, నారాయణస్వామి, మహిళా విభాగం అధ్యక్షురాలు ఉమామహేశ్వరి, సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ ఆస్తులకు మ్యుటేషన్ చేపట్టాలి




మాట్లాడుతున్న డీఆర్‌వో

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని అగ్రిగోల్డ్ ఆస్తులకు మ్యుటేషన్ చేసే ప్రక్రియను ప్రారంభించాలని డీఆర్‌వో మోహన్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో అగ్రిగోల్డ్ భూముల మ్యుటేషన్ ప్రక్రియపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. డీఆర్‌వో మాట్లాడుతూ.. జిల్లాలోని వి.కోట, ఐరాల, చిత్తూరు, పలమనేరు మున్సిపాలిటీ పరిధిలో ఉన్న అగ్రిగోల్డ్ ఆస్తుల స్థితిగతులను అడిగి తెలుసుకోవాలన్నారు. ఆ ఆస్తులకు సంబంధించి భౌతిక ధ్రువీకరణ పూర్తి చేసి రికార్డులను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. సబ్ రిజిస్ట్రార్ విలువ, మార్కెట్ విలువ గుర్తింపు చేయాలన్నారు. అగ్రిగోల్డ్ ఆస్తుల మ్యుటేషన్ అంశాలపై పకడ్బందీగా కసరత్తు చేయాలన్నారు. ప్రస్తుతం అగ్రిగోల్డ్ భూముల పరిస్థితి ఏంటి, ఆక్రమణలు, కోర్టు కేసులు తదితర అంశాలను పరిశీలన చేయాలన్నారు. ఈనెల 24వ తేదీలోగా వ్యవసాయ భూముల మ్యుటేషన్‌ను పూర్తి చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. త్వరలో జేసీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆ సమావేశంలో పకడ్బందీగా నివేదికలు సిద్ధం చేయాలన్నారు.

నేర నిరూపణలో శాఖల సహకారం

- అర్ధ వార్షిక నేర సమీక్షలో ఎస్పీ మణికంఠ
- జేసీ, డీఎఫ్‌వో, డీటీసీ, డీఈవోతో కలిసి సమీక్ష



జిల్లా అధికారులతో కలిసి పోలీసులతో సమీక్షిస్తున్న చిత్తూరు ఎస్పీ

చిత్తూరు అర్బన్ : నేరం జరిగినప్పుడు దాన్ని చట్టం ముందు నిరూపించడానికి అన్ని ప్రభుత్వ శాఖల సహకారం అవసరమవుతుందని.. దర్యాప్తు అధికారి ఆలోచన చేసి సాక్ష్యాల సేకరణతో నిందితులకు శిక్ష పడేలా చూడాలని ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశించారు. ప్రధానంగా భూ ఆక్రమణల్లో రెవెన్యూ, రోడ్డు ప్రమాదాలపై ఆర్‌టీఏ, మెడికో లీగల్ కేసుల్లో వైద్య ఆరోగ్యశాఖ, రోడ్డు ప్రమాదాల్లో ఆర్ అండ్‌బీ, ఎర్ర చందనం లాంటి కేసుల్లో అటవీశాఖతో సమన్వయం అవసరమన్నారు. మంగళవారం చిత్తూరు నగరంలోని జెడ్పీ సమావేశ మందిరంలో పోలీసుశాఖ అర్ధ వార్షిక నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి జేసీ విద్యాధరి, డీఆర్‌వో మోహన్‌కుమార్, డీటీసీ నిరంజన్‌కుమార్ రెడ్డి, డీఎఫ్‌వో భరణి, డీఈవో వరలక్ష్మి ఇతర జిల్లా అధికారులు హాజరై కేసుల దర్యాప్తులో సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. అన్ని ప్రభుత్వ శాఖలు పోలీసు శాఖకు సహకరిస్తే అంతిమంగా బాధితుడికి న్యాయం జరగడంతో పాటు దోషులకు కోర్టుల్లో శిక్ష పడుతుందన్నారు. ఇక పోలీసులు స్టేషన్‌కు వచ్చే బాధితులతో ప్రవర్తించే తీరు ఆదర్శనీయంగా ఉండాలన్నారు. సబ్–డివిజన్ల వారీగా పెండింగ్‌లో ఉన్న కేసులపై అధికారులతో చర్చించారు. అటవీ ప్రాంతాల్లో మద్యం తయారీ, ర్యాలీల్లో అసాంఘిక శక్తులను అడ్డుకోవడం, పేకాట లాంటి స్థావరాలపై దాడులు చేయడానికి డ్రోన్లను ఉపయోగించుకోవాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని, అనవసరమైన లింకులపై క్లిక్ చేయొద్దని, ఓటీపీలు చెప్పొద్దని ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు.

తగ్గిన రోడ్డు ప్రమాదాలు

గత ఆర్నెళ్ల కాలంలో రోడ్డు ప్రమాదాల సంఖ్యను తగ్గించగలిగామని, పోలీసుల పనితీరుతోనే ఇది సాధ్యమయ్యిందని ఎస్పీ పేర్కొన్నారు. అలాగే మాదక ద్రవ్యాల రవాణాను నియంత్రించడం, న్యాయస్థానాలు జారీ చేసే వారెంట్లను అమలు చేయడంపై కూడా చర్చించారు. సమావేశంలో ఎక్సైజ్ ఈఎస్ శ్రీనివాస్, రైల్వే డీఎస్పీ హర్షిత, పలువురు డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

న్యాయం కోసమే ‘శక్తి వారియర్స్’


అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్ : న్యాయం కోసం నిలబడే ధైర్యాన్ని పిల్లలు, యువతలో నింపడానికి ‘శక్తి వారియర్స్’గా పేరిట బృందాలను ఏర్పాటు చేయాలని అనంతపురం ఐజీ రాజకుమారి ఆదేశించారు. మంగళవారం ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పోలీసు అధికారులతో మాట్లాడారు. చిత్తూరు పోలీసు అతిథి గృహం నుంచి ఎస్పీ మణికంఠ, అధికారులు పాల్గొన్నారు. ఐజీ మాట్లాడుతూ.. మహిళలు–పిల్లల రక్షణపై తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు. పోక్సో కేసులు కోర్టుల్లో చార్జ్‌షీట్లను త్వరగా వేయాలన్నారు. లైంగిక వేధింపుల నేరాల్లో 60 రోజుల్లో చార్జ్‌షీట్ దాఖలు చేయాలని, ఎక్కడా నిర్లక్ష్యంగా ఉండొద్దన్నారు. అనంతరం ఐజీ ప్రస్తావించిన అంశాలపై ఎస్పీ జిల్లాలోని పోలీసులతో సమీక్షించారు.

నిందితుడి ఆచూకీ తెలిపితే రూ. 5లక్షల నజరానా


లైంగిక దాడికి పాల్పడిన నిందితుని చిత్రం

వరదయ్యపాళెం: తమిళనాడులో సంచలనం కలిగించిన బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుని ఆచూకీ తెలిపిన వారికి రూ.5లక్షలు నజరానా ఇవ్వనున్నట్లు గుమ్మిడిపూండి డీఎస్పీ జయశ్రీ తెలిపారు. నిందితుడి ఆచూకీ కోసం గాలింపు చర్యల్లో భాగంగా వరదయ్యపాళెం మండలంలో పర్యటించిన డీఎస్పీ పత్రికా ప్రకటన ద్వారా వివరాలను తెలిపారు. తమిళనాడు రాష్ట్రం ఆరంబాకంలో ఓ బాలికను అపహరించి, లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడిని సీసీ కెమెరాల ఆధారంగా గుర్తించామన్నారు. నలుగురు ఎస్పీల పర్యవేక్షణలో నాలుగు బృందాలుగా నిందితుడి కోసం గాలిస్తున్నట్లు ఆమె తెలిపారు. నిందితుడి ఆచూకీ తెలిపిన వారికి ప్రభుత్వం తరఫున రూ. 5లక్షలు నజరానా ఇస్తామని ఆమె వివరించారు. 9952060948 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని డీఎస్పీ కోరారు.

సీట్ల కేటాయింపులోనూ వైఫల్యమేనా?

తిరుపతి సిటీ : ఇంజినీరింగ్ సీట్ల కేటాయింపు జాబితా మంగళవారం విడుదల చేస్తున్నట్లు రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ అధికారికంగా ప్రకటించింది. అర్ధరాత్రి వరకు సీట్ల కేటాయింపుపై ఎటువంటి సమాచారం అందకపోవడంతో నిరాశతో ప్రభుత్వంపై విరుచకుపడుతున్నారు. సీట్ల కేటాయింపులోనూ ప్రభుత్వం వైఫల్యం చెందిందని, షెడ్యూల్ ప్రకారం జూన్ 22న ప్రకటించాల్సి ఉండగా ఇంతవరకు తమకు ఎటువంటి మెసేజ్‌లు రాలేదని వాపోతున్నారు. ఇటు అధికారులను వివరణ కోరగా మరో గంటలో తల్లిదండ్రుల మొబైల్‌ఫోన్లకు మెసేజ్ వస్తుందంటూ ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు చెబుతుండడం గమనార్హం.


జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స కోసం క్యూలో మహిళలు

జ్వరోత్పాతం!

‘అమ్మో జ్వరం.. అయ్యో ఒళ్లు నొప్పులు.. జలుబు తగ్గడం లేదు స్వామీ.. దగ్గీ..దగ్గీ పక్కెటెముకులు కూడా నొప్పులురా నాయనా..!’ అంటూ పేద రోగులు అల్లాడిపోతున్నారు. ఒక పక్క వాతావరణంలో మార్పులు.. మరోపక్క అడపాదడపా వర్షాలతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. పారిశుద్ధ్యం పడకేయడంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. జ్వరపీడుతుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ప్రభుత్వ వైద్యం సక్రమంగా అందక.. ప్రయివేటు ఆస్పత్రులకు క్యూ కట్టాల్సి వస్తోంది. జిల్లాలో సీజనల్ వ్యాధులు.. ప్రభుత్వాస్పత్రుల్లో వైద్య సేవలపై ‘సాక్షి’ గ్రౌండ్ రిపోర్టు.

జిల్లాకు సీజనల్ దడ

- జలుబు, గొంతునొప్పి, ఒళ్లు నొప్పులతో చతికిలపడుతున్న ప్రజలు
- కొన్ని మండలాల్లో జ్వరం ప్రభావం అధికం
- ఆస్పత్రులకు క్యూ కడుతున్న రోగులు
- సమయపాలన పాటించని ప్రభుత్వ డాక్టర్లు
- ఆపసోపాలు పడుతున్న పేదలు

కాణిపాకం: జిల్లాలోని పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల పరిధిల్లో రోజూ 7వేల వరకు ఓపీలొస్తున్నాయి. జిల్లా, ఏరియా, సీహెచ్‌సీ ఆస్పత్రుల్లో 3,500 వరకు ఓపీలు నమోదవుతున్నాయి. అలాగే ఈ ఆస్పత్రుల్లో 700 వరకు ఇన్‌పేషెంట్లు చేరుతున్నారు. సరైన వైద్యం అందక చాలా మంది ప్రయివేటు ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. సోమవారం జిల్లాలోని ప్రభుత్వ వైద్యశాలలను ‘సాక్షి’ విజిట్ చేసింది. అక్కడ వైద్యులు లేక.. రోగులను పట్టించుకోక చాలా మంది ఇబ్బందులు పడడం కనిపించింది.

వాతావరణంలో మార్పులు

గత కొన్ని రోజులుగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఉదయం కాసేపు పొడిగా.. ఆ తర్వాత వేడి, సాయంత్ర వర్షాలు కురుస్తున్నాయి. గత రెండు రోజులుగా జిల్లాలో పెద్దగా ఎండలు కనిపించడం లేదు. పలమనేరు, కుప్పం, రామకుప్పం, శాంతిపురం, బైరెడ్డిపల్లి, వీ.కోట, గంగవరం, పుంగనూరు, చౌడేపల్లి మండలాల్లో ఎండ ప్రభావం పెద్దగా కనిపించడం లేదు. చిత్తూరు, బంగారుపాళ్యం, తవణంపల్లి, యాదమరి తదితర మండలాల పరిధిలో కూడా చల్లదన ప్రభావం కనిపిస్తోంది. దీనికితోడు కురిసిన వర్షాలకు దోమల ప్రభావం అధికమవుతోంది.

జ్వరం, జలుబు, దగ్గు అధికం

వీడని జలుబు, దగ్గు తీవ్రతతో రోగులు అల్లాడిపోతున్నారు. విషజ్వరాలు పంజా విసురుతున్నాయి. ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. ప్రభుత్వాస్పత్రి, ఆరోగ్య కేంద్రాల్లో సరైన చికిత్స అందక ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ఈ కారణంగా జ్వరం కేసుల సంఖ్య అధికారులు పరిగణలోకి తీసుకోవడం లేదు. కేవలం ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు, ఆస్పత్రులకు వచ్చే కేసుల వివరాలే లెక్కల్లోకి ఎక్కుతున్నాయి. చాలామంది గ్రామాల్లో ఆశవర్కర్లు, ఏఎన్ఎంలు, మెడికల్ షాపుల్లో వద్ద మందులు, మాత్రలు తీసుకుని.. మంచానికి పరిమితమవుతున్నారు. జ్వరం తీవ్రత అధికమైతే తప్ప ఆస్పత్రికి వెళ్లడం లేదు. చాలా మంది వైరల్ ఫీవర్ బారిన పడుతున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు తీవ్ర జ్వరం, దగ్గు, జలుబు, తలనొప్పితో బాధపతున్నారు. మరికొందరు జ్వరం, ఊపిరి తీసుకోవడానికి ఇబ్బందులు పడుతూ వైద్యశాలల్లో ఇన్‌పేషెంట్లుగా చేరుతున్నారు. జ్వరాల బారిన పడిన వారిలో చాలామందికి డెంగీ లక్షణాలు ఉంటున్నాయి.

‘ప్రైవేటు’గా నిలువుదోపిడీ!

జ్వరాలు విజృంభిస్తుండడంతో ఇదే అదునుగా ప్రైవేటు ఆస్పత్రులు బాధితులను నిలువుదోపిడీ చేస్తున్నాయి. ప్లేట్‌లేట్స్ తగ్గాయని భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. కచ్చితంగా అన్ని రకాల పరీక్షలు చేయించుకోవాలని బాధేస్తున్నాయి. చిన్నపాటి జ్వరంతో వెళ్లినా ఐసీయూలో ఉంచి టెస్టులు, చికిత్స పేరిట వేలల్లో బిల్లులు గుంజేస్తున్నాయి.

జిల్లా సమాచారం

జిల్లా ఆస్పత్రి	-	1
ఏరియా ఆస్పత్రి	-	4
సీహెచ్‌సీలు	-	8
పీహెచ్‌సీ	-	50
యూపీహెచ్‌సీ	-	15
ప్రైవేటు ఆస్పత్రులు	-	1,300
ఆర్ఎంపీలు	-	2 వేల వరకు

పది రోజులుగా ప్రభుత్వాస్పత్రిలో ఓపీలు

దగ్గు, జలుబు	-	1,200
0–12 వయస్సు పిల్లల జ్వరం కేసులు	-	425
12–40 వయస్సు వారు	-	647
40–60 వయస్సు వారు	-	502
60 ఏళ్లు పైబడినవారు	-	376

డాక్టర్లేరి?

జిల్లాలోని పలు పీహెచ్‌సీల్లో డాక్టర్ల కొరత వేధిస్తోంది. కొన్ని పీహెచ్‌సీల్లో ఇద్దరు డాక్టర్లు ఉండాల్సి ఉండగా.. ఒకరు మాత్రమే ఉంటున్నారు. మరికొన్ని చోట్ల డాక్టర్లు సమయపాలన పాటించడం లేదు. ఆస్పత్రులకు తోచినప్పుడు వస్తున్నారు. ‘సాక్షి’ విజిట్‌లో బయటపడిన వాస్తవాలు..

- పలమనేరు పరిధిలోని కొలమాసనపల్లి, గంగవరం తదితర మండలాల్లోని పీహెచ్‌సీలకు జ్వరం కేసులు అధికంగా వస్తున్నాయి. ఇక్కడ జ్వరానికి సరైన చికిత్స అందక పలమనేరులోని ఏరియా ఆస్పత్రిని ఆశ్రయించారు.
- చౌడేపల్లి పీహెచ్‌సీలో ఉదయం 10.30గంటల వరకు కూడా డాక్టరు రావడం లేదు. అప్పటి వరకు వచ్చిన కొందరు రోగులు డాక్టర్లు లేరని ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లడం కనిపించింది. మరికొందరు సిబ్బంది డాక్టర్ల అవతారమెత్తి రోగులకు చికిత్స చేసి పంపించేశారు.
- నగరి నియోజకవర్గంలోని సీహెచ్‌సీ, పీహెచ్‌సీల్లో డ్యూటీ డాక్టర్లు డుమ్మా కొట్టడంతో ఆస్పత్రికి వచ్చే రోగులు నీరసించిపోయారు. అక్కడి స్టాఫ్‌నర్సులు, అటెండర్లే ఆరోగ్య సమస్యలు అడిగి మందులు, మాత్రలు ఇచ్చి పంపించేశారు.
- గంగాధరనెల్లూరులోని పలు పీహెచ్‌సీ డాక్టర్లు విధుల్లో ఉండడం లేదు. ఇష్టానుసారంగా వచ్చి వెళ్లిపోతున్నారు. పేద రోగులు పుత్తూరు, చిత్తూరు ప్రాంతాల్లోని ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు.
- జిల్లా కేంద్రం చిత్తూరులోని ప్రభుత్వ ఆస్పత్రికి కూడా జ్వరం, జలుబు, దగ్గుతో వచ్చే వారి సంఖ్య పెరుగుతోంది. విషజ్వరాలకు కావాల్సిన కొన్ని రకాల మందులు అందుబాటులో లేవని, బయట తీసుకోవాలంటూ ఉచిత సలహాలు ఇస్తున్నారని బాధితులు వాపోతున్నారు.
- తవణంపల్లి మండలంలో విషజ్వరాలతో పాటు డెంగీ కేసులు నమోదవుతున్నాయి.


జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఓపీ కోసం క్యూకట్టిన ప్రజలు

వైద్యులు ఉండడం లేదు



డాక్టరు ఎప్పుడు వస్తున్నారో..ఎప్పుడు వెళుతున్నారో తెలియడం లేదు. నర్సులతో చికిత్స అందిస్తున్నారు. డాక్టరు లేకపోతే ఎలా. ఈ ఆస్పత్రికి ఒక డాక్టరును వేస్తే మేలు. మాలాంటి పేదలకు బాగుంటుంది. దగ్గు, జలుబు ఉందని వస్తే..చూసే వాళ్లు లేరు. ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లాలి.

– ఏకాంబరం, నాయుడుపల్లి, శ్రీరంగరాజపురం మండలం

ఇప్పుడు కష్టాలే..!



గతంలో ప్రభుత్వాస్పత్రికి వచ్చి ఏ మందులు అడిగినా ఇచ్చేవారు. డయాలసిస్ పేషెంట్ కూడా 108 వెహికల్‌లోనే తీసుకెళ్లి డయాలసిస్ అయిన తర్వాత స్వగ్రామానికి చేరేవారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదు. మా లాంటివారు డయాలసిస్ చేసుకోపోవడానికి వీలుకావడం లేదు. మందులు కూడా ఆరకురాగానే ఇస్తున్నారు. జ్వరం వచ్చినా పలికేవారు లేరు.

– తంగరాజ్, వెంగల్‌రాజు కుప్పం గ్రామం

ఎస్వీయూ ఆర్ట్స్ కళాశాల మ్యాగజైన్ ఆవిష్కరణ



మ్యాగజైన్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, అధ్యాపకులు

తిరుపతి సిటీ:ఎస్వీయూ ఆర్ట్స్ కళాశాల 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించిన ‘ఆరా ఆఫ్ ఆర్ట్స్ మ్యాగజైన్’ను వీసీ ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు, ప్రిన్సిపాల్ ఆచార్య సుధారాణి మంగళవారం వర్సిటీలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో గణనీయమైన చరిత్ర కలిగిన యూనివర్సిటీ ఆర్ట్స్ విభాగం కార్యాలయం ప్రకాశం భవనంలో ఉండడం, అలాగే ఆర్ట్స్ కళాశాల పేరు ప్రతిబింబించేలా ఆరా పేరుతో ఈ మ్యాగజైన్ తీసుకుని రావడం హర్షణీయమన్నారు. మ్యాగజైన్‌లో విద్యార్థుల కవితలు, వ్యాసాలు, వివిధ శాఖల పురోభివృద్ధి, జాతీయ, అంతర్జాతీయ సదస్సుల నిర్వహణ, సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడల్లో సాధించిన విజయాలు వంటి వాటితో ప్రకాశిస్తుందని, ఇది దాదాపు 200 పైచిలుకు పుటలు కలిగిన డాక్యుమెంటరీ వంటి పుస్తకమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఆచార్య భాస్కర్ రెడ్డి, పాలకమండలి సభ్యులు ఆచార్య సుమకిరణ్, వార్డెన్ ఆచార్య ప్రయాగ, ఆచార్య రాజేశ్వరమ్మ, ఆచార్య అమీనుల్లా, డాక్టర్ ఓబులేసు, రాజు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

వదలబొమ్మాళీ.. వదలా!

- సస్పెండ్ అయినా ఆఫీస్‌లోనే తిష్ట
- హౌసింగ్ శాఖలో ఇన్‌చార్జి పీడీ లీలలు
- కలెక్టర్ రమ్మన్నారంటూ ప్రచారం


సస్పెన్షన్ అనంతరం కార్యాలయానికి వచ్చి సంతకాలు చేస్తున్న ఇన్‌చార్జి పీడీ గోపాల్ నాయక్



రాష్ట్ర హౌసింగ్ శాఖ ఎండీ జారీ చేసిన పీడీ గోపాల్ నాయక్ సస్పెన్షన్ ఉత్తర్వులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా హౌసింగ్ కార్యాలయంలో వింత ధోరణి నెలకొంది. ఆ శాఖ ఇన్‌చార్జి పీడీగా పనిచేస్తున్న గోపాల్‌నాయక్‌పై అవినీతి ఆరోపణలకు గాను సస్పెండ్ చేస్తూ ఈనెల 14వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇన్‌చార్జి పీడీగా పనిచేస్తున్న గోపాల్‌నాయక్ అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఈఈగా పనిచేస్తున్న సమయంలో అవినీతికి పాల్పడినందుకు గాను ఏసీబీ కేసు నమోదైంది. ఆ కేసు విచారణ పూర్తయిన తర్వాత ప్రస్తుతం రాష్ట్ర గృహనిర్మాణ శాఖ అధికారులు ఇన్‌చార్జి పీడీని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ఉత్తర్వులను ప్రభుత్వ జీఓ వెబ్‌సైట్‌లో ప్రచురించింది. సాధారణంగా సస్పెండ్ అయిన తర్వాత సంబంధిత అధికారి సస్పెన్షన్ రద్దు అయ్యే వరకు కార్యాలయానికి వచ్చేందుకు అవకాశం ఉండదు. అయితే కలెక్టరేట్‌లోని హౌసింగ్ కార్యాలయానికి సస్పెండ్ అయిన ఇన్‌చార్జి పీడీ గోపాల్‌నాయక్ నిత్యం కార్యాలయానికి రావడం విమర్శలకు తావిస్తోంది.

కార్యాలయానికి వస్తూ..

రోజూ కార్యాలయానికి వచ్చి నీ పని నీవు చేసుకోమని కలెక్టర్ చెప్పారంటూ పీడీ గోపాల్‌నాయక్ ప్రచారం చేసుకుంటున్నారు. ఈ ప్రచారం విన్న కలెక్టరేట్‌లోని పలు శాఖల అధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు సస్పెండ్ అయిన తనకు ఇంకా రాష్ట్ర కార్యాలయం నుంచి సస్పెన్షన్ ఉత్తర్వులు రాలేదని బుకాయింపు చేయడం కొసమెరుపు. సస్పెన్షన్ ఉత్తర్వులు కొద్ది రోజుల ముందే పీడీ కార్యాలయం మెయిల్ కు వచ్చినప్పటికీ గుట్టు చప్పుడు కాకుండా ఆ మెయిల్‌ను డిలిట్ చేయించేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా ఉన్నతాధికారి అయిన కలెక్టర్ పేరుకు భంగం కలిగే విధంగా సస్పెండ్ అయిన పీడీ వ్యవహరించడం జిల్లాలో హాట్ టాపిక్ గా మారింది.

సంతకాలు చేస్తూ..

సస్పెన్షన్ అయిన తర్వాత కార్యాలయానికి రావడమే తప్పు అయితే ఆ పీడీ ఏకంగా సంతకాలే చేయడం విమర్శలకు తావిస్తోంది. సస్పెన్షన్ అయిన అనంతరం కార్యాలయానికి వచ్చి పలు ఫైల్స్‌లో పీడీ సంతకాలు చేయడం జిల్లా అడ్మినిస్ట్రేషన్‌ను మోసగించడమేనని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. ఆ విచారణ పూర్తి అయ్యి ఉన్నతాధికారులు సస్పెన్షన్ ను తొలగిస్తే ఆయన తన విధులను తిరిగి కొనసాగించాల్సి ఉంటుంది. అయితే ఇక్కడ విరుద్ధంగా వ్యవహరించడంపై ఆరోపణలు గుప్పుమంటున్నాయి. కాగా సస్పెన్షన్ అయిన పీడీ పోస్టును జాయింట్ కలెక్టర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించాలని కలెక్టర్ ప్రభుత్వానికి నివేదికలు పంపినట్లు తెలుస్తోంది.

తిరుమల సర్వీసులు కండిషన్‌లో ఉంచుకోండి

తిరుపతి అర్బన్ : తిరుమల ఘాట్‌రోడ్డులో నడుపుతున్న ఆర్టీసీ సర్వీసులు వందశాతం కండిషన్‌లో ఉండేలా చూసుకోవాలని డిప్యూటీ చీఫ్ మెకానిక్ ఇంజనీర్ టి.బాలాజీ తెలిపారు. తిరుపతిలోని ఆర్టీసీ డీపీటీఓ కార్యాలయంలో మంగళవారం జిల్లాలోని 11 డిపోలకు చెందిన మెకానికల్ ఇంజినీర్లు, మెకానికల్ సూపర్‌వైజర్లకు బస్సుల కండిషన్‌ను గుర్తించడంపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ సెప్టెంబర్ చివరి వారంలో తిరుమల బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇప్పటి నుంచే ప్రతి డిపోలో 100 శాతం కండిషన్‌లో ఉండే సర్వీసులపై దృష్టి పెట్టాలని చెప్పారు. వివిధ కంపెనీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి దొంగల గుట్టురట్టు

- బోయకొండ టికెట్ల విక్రయాల్లో దోపిడీ
- ఆరుగురు సిబ్బందిపై వేటు


బోయకొండ ఆలయ ముఖచిత్రం

చౌడేపల్లె : జిల్లాలో రెండో పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న బోయకొండ గంగమ్మ ఆలయంలో ఇంటి దొంగలు చేతివాటం చూపారు. పెద్ద భోగం టికెట్లు విక్రయించే కౌంటర్లలో దోపిడీ చేసి అడ్డంగా దొరికిపోయిన సంఘటన బోయకొండలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గుట్టు చప్పుడుగా సాగుతున్న ఈ వ్యవహారం పంపకాల్లో వ్యత్యాసం రావడంతో బట్టబయలైంది. ఈ ఘటనతో బోయకొండ ఆలయంలో పలు అనుమానాలకు తావిస్తోంది. టికెట్ల విక్రయాల్లో అక్రమాలు చోటు చేసుకోవడంతో ఆలయ ఆదాయానికి గండి పడింది. ఈ ఘటనకు కారకులైన ఆరుగురు సిబ్బందిపై వేటు వేశారు.

అసలేం జరిగిందంటే...

బోయకొండ గంగమ్మకు కోరిన కోర్కెలు తీరిన భక్తులు జంతు బలులు సమర్పించి అమ్మవారికి పూజలు చేసి మొక్కులు తీర్చడం ఆనవాయితీ. ఈ క్రమంలో ఆలయం వద్ద పెద్ద భోగం (పొట్టేళ్లు, మేక పోతులు, దున్నపోతులు) చిన్నభోగం కోళ్లు వీటిని అమ్మవారికి బలిస్తారు. పెద్దభోగానికి గాను ఒక్కొక్క దానికి రూ.200 చెల్లించి రశీదు తీసుకొని ఆలయం పై భాగంలో గల పెద్దభోగం, చిన్నభోగం వద్దకు తీసుకెళ్తారు. అక్కడ అమ్మవారికి పూజలు చేసి తంతు పూర్తి చేసి మొక్కు చెల్లించడం ఆనవాయితీ.

చేతివాటం జరిగింది ఇలా...

పెద్దభోగం టికెట్లు విక్రయించడానికి అధికారులు ఆలయం వద్ద కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ ప్రక్రియ నాలుగు నెలల నుంచి అమలు చేస్తున్నారు. రూ. 200 చెల్లించి టికెట్లు తీసుకెళ్లిన భక్తులకు పూజ చేసి పంపాల్సి ఉంది. మ్యాన్యువల్‌గా టికెట్లు విక్రయిస్తారు. టికెట్టులో అర్ధ భాగం కౌంటర్ ఫైల్‌ను భద్రపరిచి మిగిలిన సగం టికెట్టు భక్తుడుకి ఇవ్వాల్సి ఉంది. ఆషాఢ మాసంలో భక్తుల రద్దీ అధికంగా ఉండడంతో పాటు ఈనెల 9 వతేదీ సర్వర్ పనిచేయకపోవడంతో మ్యానువల్‌గా టికెట్లు విక్రయం చేపట్టారు. ఈ టికెట్లు విక్రయాల్లో సిబ్బంది చేతివాటం చూపి 213 కౌంటర్ ఫైల్ టికెట్లు చింపి భక్తులకు విక్రయించి రూ.42,600 సొమ్ము చేసుకున్నారని సమాచారం.

పంపకాల్లో తేడాలతో బయటకు..

టికెట్లు చేతివాటం చూపిన సొమ్ములో మనస్పర్ధలు రావడంతో విషయం బయటకు వచ్చింది. విషయాన్ని తన దృష్టికి రావడంతో ఏప్రిల్ నుంచి విక్రయించిన టికెట్ల విక్రయాల కౌంటర్ ఫైల్స్ పరిశీలించి అక్రమాలకు పాల్పడింది వాస్తమని తేల్చినట్లు ఈఓ తెలిపారు. ఈ ఘటనకు పాల్పడిన రెగ్యులర్ సిబ్బంది నాగముని, అవుట్ సోర్సింగ్ సిబ్బంది విజయ్‌కుమార్‌రెడ్డి, సోము శేఖర్‌రాజు, మునిశేఖర్, హరిప్రసాద్, ఏ. గంగరాజు అక్రమాలకు పాల్పడినట్లు ఈఓ గుర్తించారు.

ఈఓ ఏమన్నారంటే.....

పెద్దభోగం టికెట్ల విక్రయాల్లో చేతివాటం చూపిన విషయం వాస్తమని బోయకొండ ఈఓ ఏకాంబరం అంగీకరించారు. రెగ్యులర్ సిబ్బంది ఒకరిని సస్పెండ్ చేసి అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని విధుల్లో నుంచి తొలగించామని చెప్పారు. టెంపుల్ ఇన్‌చార్జి ఇద్దరితో పాటు డీసీఆర్ విధులు నిర్వహించే సిబ్బందికి మెమోలు జారీ చేసినట్లు చెప్పారు. అలాగే ఆరుగురిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఈఓ పేర్కొన్నారు.


బోయకొండలో టికెట్లు విక్రయించే కేంద్రం

ఎస్వీయూ స్నాతకోత్సవం నిర్వహించండి


వీసీకి వినతిపత్రం అందజేస్తున్న శివశంకర్ నాయక్, విద్యార్థులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ స్నాతకోత్సవం నిర్వహణను అధికారులు పట్టించుకోకపోవడంతో విద్యార్థుల పరిస్థితి దారుణంగా ఉందని జీఎస్ఎన్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు శివ శంకర్ నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడిని మంగళవారం ఆయన కలసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ 2022లో 62వ కాన్వికేషన్ నిర్వహించారని, అప్పటి నుంచి కాన్వికేషన్ నిర్వహించకుండా జాప్యం చేస్తూ విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. డిగ్రీ, పీజీ పూర్తి అయిన పేద విద్యార్థులు ఇన్ అడ్వాన్స్ ఫీజులు కట్టలేక ఇబ్బంది పడుతూ ధ్రువపత్రాలను తీసుకోలేకపోతున్నారని తెలిపారు. కోర్సు పూర్తయిన తర్వాత ఉద్యోగాలు పొందిన విద్యార్థులు ఇంటర్వ్యూలకు కాన్వికేషన్ సర్టిఫికెట్ కోసం వర్సిటీ పరిపాలనా భవనం చుట్టూ తిరుగుతున్నారని మండిపడ్డారు. ఇన్ అడ్వాన్స్ సర్టిఫికెట్ ఫీజులు రూ.వేలల్లో కట్టలేక నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు. వెంటనే అధికారులు చొరవ చూపి స్నాతకోత్సవాన్ని నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్ నాయక్, సురేంద్ర, రాజశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.